క్లుప్తంగా

బకాయిలు చెల్లించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న లక్ష్మణమూర్తి

మల్కాపురం: పారిశుద్ధ్య కార్మికులకు ఏడు నెలల బకాయిలతో పాటు హెల్త్ అలవెన్స్ వెంటనే చెల్లించాలని సీఐటీయూ మల్కాపురం జోన్ కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి డిమాండ్ చేశారు. 60వ వార్డు గుల్లలపాలెం హాకర్స్ జోన్ పాయింట్ వద్ద 58,59,60వ వార్డుల పారిశుధ్య కార్మికులతో కలిసి బుధవారం సమావేశం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పారిశుధ్య కార్మికులకు హెల్త్ అలవెన్స్ చెల్లిస్తామని హామీ ఇచ్చి నెలలు దాటుతున్నా అమలు చేయలేదని ఆరోపించారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు,సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

నేడు 58వ వార్డులో గడప గడపకు..

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు ములగాడలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం జరగనుంది. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ గడప గడపకు వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకోవడంతో పాటు ఇంత వరకు ప్రభుత్వ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరిస్తారు. వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం అనంతరం 59వ వార్డు నక్కవానిపాలెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆడారి ఆనంద్‌కుమార్ ప్రజలకు అందుబాటులో ఉంటారు. మధ్యాహ్నం 3 గంటలకు అచ్చింనాయుడు కొండ ప్రాంతంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను ఆయన పరిశీలిస్తారు.

బాలికలను కాపాడుకుందాం



బాలికల హక్కులపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రదీప్

పెదగంట్యాడ: అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని జీవీఎంసీ 77వ వార్డు దేవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజా ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలను కాపాడుకోవడం అందరి బాధ్యత అన్నారు. గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం గురించి అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. బాలికల హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కె.అన్నపూర్ణ, ఎం.శ్రీనివాసరావు, బి.గోపాలం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో ముగిసిన క్యాంప్



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న కేవీ వాల్తేర్ ప్రిన్సిపాల్ కమల్‌జీత్

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయం వాల్తేర్‌లో సోమవారం ప్రారంభమైన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంప్ బుధవారంతో ముగిసింది. ఉదయం సర్వమత ప్రార్థనలు చేశారు. అనంతరం ఫ్లాగ్ బ్రేక్, రాత పరీక్ష, లాగ్ బుక్స్ తనిఖీలు నిర్వహించారు. 11 స్కూళ్ల నుంచి పాల్గొన్న సుమారు 200 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జీత్ మాట్లాడుతూ స్కౌట్ అండ్ గైడ్ కలిగి ఉండవలసిన క్రమశిక్షణ, చురుకైన భాగస్వామ్యం ప్రతీ ఒక్కరూ కలిగి ఉన్నారని ప్రశంసించారు. చివరిగా స్కౌట్ అండ్ గైడ్ పతాకం అవనతం చేశారు. క్యాంప్‌లో పాల్గొన్న వారందరికీ ఆయన ప్రశంసాపత్రాలు అందజేసి కార్యక్రమాన్ని ముగించారు.

తీరు మారదా..!

- ఫుట్‌పాత్‌ల ఆక్రమణతో ఇబ్బందులు
- ట్రాఫిక్ నిబంధనలు బేఖాతర్
- పోలీసులు హెచ్చరించినా పట్టించుకోని వ్యాపారులు



ఎన్‌ఏడీ కూడలిలో ఓ ప్రైవేటు స్కూలు ముందు ఫుట్‌పాత్ ఇలా ఆక్రమణ



బాజీ జంక్షన్‌లో రోడ్డుపైనే షోరూమ్‌కు చెందిన వాహనాల పార్కింగ్

విశాఖ విద్య: ఎన్‌ఏడీ కూడలిలో ప్రయాణం సాఫీగా సాగేలా ట్రాఫిక్ పోలీసులు కృషి చేస్తున్నా.. కొంతమంది వ్యాపారుల వ్యవహారశైలితో ట్రాఫిక్ కష్టాలు మళ్లీ మొదటికే వస్తున్నాయి. ఫుట్‌పాత్‌లతో పాటు రహదారిని సైతం ఆక్రమించి వ్యాపారాలు చేస్తుండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఎన్‌ఏడీ కూడలి నుంచి పెందుర్తి వైపు వెళ్లే బీఆర్‌టీఎస్ రహదారిలో ఇటీవల వాహనాల రాకపోకల సంఖ్య బాగా పెరిగింది. పెందుర్తి పరిసర ప్రాంతాల నుంచి నగరంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు విధులకు హాజరయ్యే వారు అదే విధంగా పాఠశాలలు, కళాశాలలకు వచ్చే విద్యార్థులతో ఉదయం, సాయంత్రం వేళల్లో బీఆర్‌టీఎస్ రహదారిపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఎన్‌ఏడీ సెంటర్ నుంచి బాజీ జంక్షన్ వరకు అయితే పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. దీన్ని నివారించేందు ఉన్నతాధికారుల సూచనల మేరకు ట్రాఫిక్ సీఐ కె.అశోక్ కుమార్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని తగిన చర్యలు తీసుకున్నారు. బాజీ జంక్షన్‌లో కొన్ని రోజులు ట్రాఫిక్ ఆంక్షలు విధించి, ప్రస్తుతం అక్కడ ఆటోమేటిక్ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇదే క్రమంలో ఫుట్ ఫాపాల ఆక్రమణలు తొలగించేందుకు సైతం దృష్టి సారించారు.

తీరుమారకుంటే ఇబ్బందులు తప్పవు

ఎన్‌ఏడీ కూడలి నుంచి బాజీ జంక్షన్ వరకు ఫుట్‌పాత్‌ల ఆక్రమణలతోనే ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతుందని భావించిన ట్రాఫిక్ పోలీసులు వాటిని తొలగించాలని వ్యాపారస్తులకు హెచ్చరికలు చేశారు.

అయినప్పటికీ కొంతమంది నుంచి స్పందన లేకపోవడంతో ట్రాఫిక్ పోలీసులు స్వయంగా రంగంలోకి దిగి వాటిని తొలగించారు. కానీ కొద్ది రోజులకే మళ్లీ ఫుట్‌పాత్‌లను మూసేస్తున్నారు. రోడ్లపై వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో సమస్య మళ్లీ మొదటికి వస్తుందని పరిసర కాలనీ వాసులతో పాటు వాహనచోదకులు వాపోతున్నారు.

బాధితులకు ఆనంద్‌కుమార్ పరామర్శ



బాధితుడి యోగక్షేమాలు తెలుసుకుంటున్న ఆనంద్‌కుమార్

మల్కాపురం: కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన వారిని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ బుధవారం పరామర్శించారు. 58వ వార్డు ములగాడ ప్రాంతానికి చెందిన 12 మంది యువకులు ఆదివారం గాజువాకలోని ఓ రెస్టారెంట్‌లో ఆహారం తిని అనారోగ్యానికి గురయ్యారు. వీరిలో పరిస్థితి విషమంగా ఉన్న నలుగురికి ఆడారి ఆనంద్‌కుమార్ సొంత నిధులతో వైద్య సేవలు అందిస్తున్నారు.ములగాడ పట్టణ ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న ఇద్దరిని బుధవారం ఆనంద్‌కుమార్ పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని సూచించారు.అనంతరం కిమ్స్ ఐ కాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నలుగురిని ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో 58వ వార్డు పార్టీ అధ్యక్షుడు కృష్ణ, ములగాడ వాసులు పెద్దాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఎకో వైజాగ్‌ను విజయవంతం చేయాలి

డిప్యూటీ మేయర్ శ్రీధర్



విశాఖ విద్య: పర్యావరణ పరిరక్షణలో భాగంగా జీవీఎంసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఎకో వైజాగ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 52వ వార్డు పరిధిలోని అన్ని కాలనీల్లో మిద్దెతోటల పెంపకానికి అవసరమైన సామగ్రి పంపిణీ చేసేలా కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. దీని కోసం మర్రిపాలెం ఉడా లే అవుట్ కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 10 గంటలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఇంటిపై కప్పుపై సేంద్రియ వ్యవసాయం చేసేవారికి దేశీయ కూరగాయల మొక్కలు, పిచ్చుకులు, పక్షులకు నీళ్ల ఆహారం పెట్టేందుకు గూళ్ల వంటివి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మర్రిపాలెం పరిసర కాలనీ వాసులు భాగస్వాములు కావాలని కోరారు.

హాలీవుడ్ ఎగ్జిబిషన్ ప్రారంభం



చిన్నారులను ఆకట్టుకునే చిత్రాలు

మల్కాపురం : జీవీఎంసీ 58వ వార్డు పరిధిలోని మైదానంలో హాలీవుడ్ పేరిట ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే పి.గణబాబు బుధవారం సాయంత్రం ప్రారంభించారు. విజయవాడకు చెందిన నిర్వాహకులు చిన్నారులను ఆకట్టుకునే విధంగా స్పైడర్‌మ్యాన్, హీమ్యాన్, సూపర్‌మ్యాన్, టార్జాన్ ఇలా పలు నమూనాలతో కూడిన సుమారు 15 నుంచి 20 అడుగుల ఎత్తుతో కూడిన బొమ్మలను ముఖద్వారం వద్ద ఏర్పాటు చేశారు. అలాగే ఎగ్జిబిషన్ ఆవరణలో మహిళల కోసం హ్యాండ్లూమ్స్, వంట సామగ్రి ఏర్పాటు చేశారు. జెయింట్ వీల్, మేజిక్ కార్, రంగుల రాట్నం, మ్యాజిక్ లేడీ డ్యాన్స్ వంటి హంగులతో పాటు, వివిధ తినుబండారాల షాపులు నెలకొల్పారు. ప్రతి రోజు సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు ప్రవేశం ఉంటుందని తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రదర్శన ఉంటుందన్నారు. టికెట్ రూ. 20 అని నిర్వాహకులు తెలిపారు.

ప్రమాదకరంగా గోతులు



గోపాలపట్నం రైతుబజారులో ప్రమాదకరంగా ఉన్న గోతులు

గోపాలపట్నం : గోపాలపట్నం రైతుబజారులో గోతులు ప్రమాదకరంగా తయారయ్యాయి. వాటిని బాగు చేసే నాథుడు కరవయ్యాడని వినియోగదారులు వాపోతున్నారు. ఇక్కడి రైతుబజారు సెంటర్ సర్కిల్‌లో కాల్వలపై ఉన్న పలకలు శిథిలమయ్యాయి. చాలా చోట్ల పెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని నెలలుగా ఇక్కడి పరిస్థితి ఇదే విధంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. వినియోగదారుల తాకిడి ఎక్కువగా ఉన్న ఈ బజారులో పరిస్థితి ఇలా ఉంటే అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ కాల్వలపై పలకలు వెయ్యాలని ప్రజలు కోరుతున్నారు.

ఆరోగ్య సురక్ష సామగ్రి అందజేత



ఏఎన్‌ఎంలకు ఆరోగ్య సురక్ష సామగ్రి అందిస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: ఆరోగ్య సురక్ష సామగ్రిని జీవీఎంసీ 91, 92 వార్డుల సచివాలయాల ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలకు జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆయన ఇంటి వద్ద అందించారు. ఈ సందర్భంగా ఆయన ఆట్లాడుతూ ఈ సామగ్రిని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్‌కుమార్ తన సొంత నిధులతో సమకూర్చారని తెలిపారు. బీపీ ఆపరేటింగ్‌మిషన్,గ్లూకోమీటర్ అందించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజల వద్దకు చేరాలన్న లక్ష్యంతో ఈ పరికరాలు అందిచారన్నారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షులు అప్పలస్వామి నాయుడు, గుణిశెట్టి శ్రీనివాసరావు, నాయకులు కంపర సత్తిబాబు, ఊటపల్లి గోవిందు, దేరెడ్ల సత్యనారాయణ, గొంతిన శ్రీనివాసరావు, కంపర రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం



కళాశాల నుంచి ర్యాలీగా వెళ్తున్న విద్యార్థులు

గోపాలపట్నం: జీవీఎంసీ 88వ వార్డు నరవలోని బెహరా పాలిటెక్నిక్, నర్సింగ్ కళాశాలల ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆడ పిల్లలను పుట్టనిద్దాం, ఆడపిల్లలను బతకనిద్దాం అంటూ నినాదాలు చేస్తూ నరవ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఇందుమతి మాట్లాడుతూ ఆడపిల్లలపై జరుగుతున్న అత్యాచారాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అనూష ప్రియ, దివ్యశ్రీ, నీరజ, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి ఖోఖో పోటీలు

గాజువాక : వచ్చే నెల 2 నుంచి 4వ తేదీ వరకు గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రైవేట్ పాఠశాలల సంఘం (జిప్సా) పరిధిలోని పాఠశాలల విద్యార్థినులకు ఖోఖో పోటీలను నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు పాలవలస భాస్కరరావు తెలిపారు. బుధవారం నిర్వహించిన జిప్సా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పోటీలకు ప్రతీ స్కూల్ నుంచి రెండు జట్లు మాత్రమే పాల్గొనాలన్నారు. 6, 7 తరగతుల నుంచి పాల్గొనే విద్యార్థులు జూనియర్స్‌గా, 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులు సీనియర్స్ జట్టుగా నమోదు చేసుకోవాలని సూచించారు. పాల్గొనదలచిన జట్లు ఈ నెల 30 లోగా నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు నవంబర్ 10న బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

అక్కడ వెలుగు.. ఇక్కడ అంధకారం!

- లైట్లు వెలగక వాహనదారుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



నేవల్ ఏరియాలో వెలుగుతున్న లైట్లు



చీకటిలో మల్కాపురం నుంచి శ్రీహరిపురం వెళ్లే మార్గం

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని సర్వీసు రోడ్ల వెంబడి వీధిలైట్ల నిర్వహణ గాడితప్పింది. ఒక మార్గంలో లైట్లు వెలుగుతుంటే.. సాధారణ పౌరులు తిరిగే మార్గంలో మాత్రం అంధకారం అలముకుంది.దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి

హెచ్‌పీసీఎల్ విస్తరణ పనుల్లో భాగంగా సింధియా నుంచి ఐవోసీకి వెళ్లే మార్గం వరకు డివైడర్ తొలగించారు. రియాక్టర్లు,కోలామ్‌లు తదితర భారీ సామగ్రి తరలించేందుకు అనువుగా డివైడర్‌ను తొమ్మిది నెలల కిందట తొలగించడంతో అప్పటి నుంచి అంధకారం మొదలైంది. గాజువాక ఆర్టీసీ డిపో నుంచి కోరమాండల్ వరకు రోడ్డు పై షో ల్యాంప్స్ కూడా తీసేశారు. అయితే తొలగించిన లైట్ల స్థానంలో రోడ్డుకు ఇరువైపులా తాత్కాలికంగా స్తంభాలు ఏర్పాటు చేసి లైట్లు అమర్చాలి. కానీ అలాంటి చర్యలు చేపట్టలేదు.దీంతో ఆయా మార్గాల్లో లైట్లు లేక రాత్రి సమయంలో అంధకారంగా ఉంటుంది. ఈ కారణంగా ఆ మార్గాల్లో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి.ఇదే మాదిరిగా పైపులైన్ దగ్గర నుంచి డాక్‌యార్డ్ పరిధిలో డివైడర్ లేకపోయినా ఆ మార్గంలో నేవల్ వారు అక్కడ రక్షణ గోడలకు, తాత్కాలికంగా స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ షో ల్యాంప్స్‌ను అమర్చారు. నేవల్ అధికారులు తీసుకున్న చర్యల మాదిరిగా జీవీఎంసీ అధికారులు ఎందుకు తీసుకోవడం లేదని పారిశ్రామిక ప్రాంతానికి చెదిన పలువురు వాహనదారులు,పాదచారులు ప్రశ్నిస్తున్నారు.

సేవల్లో మేటి వానప్రస్థ వృద్ధాశ్రమం

శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి



ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న స్వరూపానందేంద్ర స్వామీజీ

మురళీనగర్: మానవ సేవే మాధవ సేవ అన్న సూక్తి తూచా తప్పకుండా అమలు చేస్తూ సామాజిక సేవలో మేటిగా వానప్రస్థ వృద్ధాశ్రమం నిలుస్తోందని విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి అన్నారు. 49వ వార్డు పట్టాభిరెడ్డి గార్డెన్స్‌లోని వానప్రస్థ వృద్ధాశ్రమం బుధవారం నిర్వహించిన 12వ వార్షికోత్సవంలో ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర స్వామితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ వృద్ధాశ్రమ నిర్వాహకుడు శ్రీనివాస్ వృద్ధులకు చేస్తున్న సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. సనాతన హిందూ ధర్మంలో పూజాధికాలతోపాటు దీనులు, అభాగ్యులను ఆదుకోవడానికి కూడా అత్యంత ప్రాధాన్యముందని పేర్కొన్నారు. పురాణాలు, వేదాల్లో ఈ ప్రస్తావన ఉందని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో వృద్ధాశ్రమాల అవసరం ఎంతో ఉందని సూచించారు. నిరాదరణకు గురైన తల్లిదండ్రులను అక్కున చేర్చుకుని సేవలందించడం గొప్ప విషయమని, యువతరం వానప్రస్థ వృద్ధాశ్రమ సేవలను ఆదర్శంగా తీసుకుని సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ ఆశ్రమం 25 వసంతాలు పూర్తి చేసుకుని సేవలను మరింతగా విస్తరించాలని స్వామి ఆకాంక్షించారు. ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి నిర్వాహకుడు శ్రీనివాస్‌ను అభినందించారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి ఎస్వీ జోగారావు



మాట్లాడుతున్న ఆచార్య వెలమల సిమ్మన్న

సీతంపేట: కవిగా, కథకుడిగా, నాటక రచయితగా, వ్యాసకర్తగా, పరిశోధకుడిగా, విమర్శకుడిగా, సంపాదకుడిగా బహుముఖ ప్రజ్ఞతో ఎనలేని కీర్తి ప్రతిష్ఠలు సంపాదించిన సాహితీ సంపన్నుడు ఆచార్య ఎస్వీ జోగారావు అని ఆచార్య వెలమల సిమ్మన్న కొనియాడారు. జోగారావు 92వ జయంతి సందర్భంగా సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజం కళాశాలలో ఆయన సాహితీ ప్రసంగం చేశారు. జోగారావు చేసిన వచన కవిత్వం కమనీయంగా ఉంటుందని, సంప్రదాయ, ఆధునిక కవిత్వాల్లో అందెవేసిన చెయ్యని పేర్కొన్నారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకరరావు మాట్లాడుతూ జోగారావు రాసిన యక్షగాన వాఙ్మయ చరిత్ర ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. దాస భారతీయ ప్రచురణ సంస్థ ఏర్పాటు చేసి తెలుగులో దాస సాహిత్యంపై ఎన్నో గ్రంథాలు ప్రచురించారన్నారు. డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో అధ్యాపకుడిగా ఎందరో సాహితీవేత్తలను తయారు చేసిన ఉత్తమ ఆచార్యుడు ఎస్వీ జోగారావు అని ప్రసంశించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు కె.జి.వేణు, చిన సూర్యనారాయణ, కొత్తూరి రమణ, కె.వి.ఎస్.మూర్తి, రామతాత, కుప్పిలి భీమేశ్వరరావు, నారాయణాచార్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడి మృతి

మృతుడిది పార్వతీపురం

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. పార్వతీపురానికి చెందిన కొండెంశెట్టి వెంకటరమణ(63) తన పెద్ద కుమార్తె కొడుకు(మనవడు)కు రోడ్డు ప్రమాదం జరిగిందని తెలిసి చూడటానికి బుధవారం ఉదయం 8.30 గంటల సమయంలో పార్వతీపురం నుంచి జ్ఞానాపురం రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. అక్కడి నుంచి కంచరపాలెం పరిధి రైల్వే న్యూకాలనీలో ఉంటున్న కుమార్తె ఇంటికి నడుచుకుని వెళ్తుండగా.. షిర్డీసాయిబాబా ఆలయం వద్దకు వచ్చేసరికి అదే మార్గంలో వెనుక నుంచి వేగంగా వస్తున్న పల్సర్ బైకు అతడిని ఢీకొంది. దీంతో ఆ వృద్ధుడు కిందపడి స్పృహ కోల్పోయాడు. వెంటనే అతడిని కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఉదయం 10.30 గంటలకు వెంకటరమణ మృతి చెందాడు. మృతుడి కుమార్తె జి.జ్యోతి ఫిర్యాదు మేరకు సీఐ ఎన్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ సతీష్ కేసు దర్యాప్తు చేపట్టారు.

రహదారి భద్రతపై స్కౌట్స్ అండ్ గైడ్స్ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, ట్రాఫిక్ పోలీసులు, విద్యార్థులు

పెదగంట్యాడ: రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు. పాఠ్య పుస్తకాల్లో తాము చదివిన పాఠాలను, నేర్చుకున్న విషయాలను అందరికీ తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. పెదగంట్యాడ న్యూపోర్టు ట్రాఫిక్ స్టేషన్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, వేగం కంటే ప్రాణం ముఖ్యం అంటూ నినాదాలు చేశారు. ట్రాఫిక్ ఎస్ఐ రాజు మాట్లాడుతూ విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన రావడం అభినందనీయమన్నారు. సేవా నిరతి, దేశం పట్ల ప్రేమను విద్యార్థి దశ నుంచే అలవర్చేది స్కౌట్స్ అండ్ గైడ్స్ మాత్రమేనని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్, హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపాధ్యాయుడు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల చదువుపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి

అక్కిరెడ్డిపాలెం: పిల్లల చదువుపై తల్లిదండ్రులు మరింతగా దృష్టి సారించాలని మిండి జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి.వి.ఎస్.ఎస్.ఎస్.ఆంజనేయ కోరారు. పాఠశాలలో బుధవారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌ను ఎక్కువగా వినియోగించడం వల్ల వారి సమయం చాలా వృథా అవుతోందన్నారు. జీవితాలు నాశనమయవుతున్నాయన్నారు. విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకుని భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఉన్నత శిఖరాలు అధిరోహించిన మేధావులను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దసరా సంచిక ఆవిష్కరణ



దసరా సంచికను ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

గాజువాక : గాజువాక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న దేవీ నవరాత్రుల సంచికను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘం పెద్దలు మాట్లాడుతూ దసరా సంచిక విశిష్టతను వివరించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉత్సవాలను ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గుంపున గురునాథ గుప్త, నాయకులు గునిశెట్టి అప్పల సత్యనారాయణ గుప్త, ఏవీఎస్ఎన్ గుప్త, పబ్బతి సూర్యనారాయణమూర్తి, కోట గోపాలరావు పాల్గొన్నారు.

అప్పల బాధతో మహిళ ఆత్మహత్య

సింహాచలం: అప్పులబాధతో మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం పెందుర్తి జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో చోటు చేసుకుంది. జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో వాకాడ అప్పలరాజు భార్య భాగ్యలక్ష్మి(42) నివాసం ఉంటున్నారు. అప్పలరాజు జీవీఎంసీలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. భాగ్యలక్ష్మి పలుచోట్ల అప్పులు చేయడంతో వారు వచ్చి పదేపదే అడుగుతున్నారు. దీంతో మనస్థాపానికి గురై బుధవారం మధ్యాహ్నం నాలుగు గంటల సమయంలో ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందింది. సమాచారం అందుకున్న పెందుర్తి సీఐ శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

వైభవంగా నృసింహుడికి ఆర్జిత సేవలు



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం నిర్వహించారు. ఆలయ బేమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

- శ్రీ వరావరా లక్ష్మీనృసింహస్వామికి బుధవారం సహస్ర నామార్చన నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. 1001 నామాలతో స్వామికి తులసితో అర్చన చేశారు. విశేషంగా హారతులు అందజేశారు.